# తహసీలుదారు గాదు - వర్తకుడు

వేంకటసుబ్బయ్య అడకువ గల యువకుడు. తల్లిదండ్రులమాట కెదురాడడు. బి.యే. పరీక్షకు చదువుచుండగా సుందరమ్మ కాపురమునకు వచ్చెను. తల్లిపోరువలన ఆతడు సుందరమ్మను చెన్నపట్టణము తీసుకొనివెళ్ళి నాలుగుమాసములు ఉంచుకొని పంపివేసెను.

యుక్తసమయమున ఆతడు పరీక్షలో నెగ్గి యింటికి వచ్చెను. "కాలేజీలో మేష్టరీ చేస్తే లాభం వుంది. బదలాయింపుల భయం వుండదు. పూచీలేదు. కష్టంలేదు. నెలకి నూరురూపాయలకు తక్కువ వుండదు" అని తండ్రిచెప్పెను. "మేస్త్రీటు అయితే దర్జా సాగుతుంది. కాలిమీద కాలు వేసికొని కడుపులో చల్ల కదలకుండా కూచోవచ్చు. డబ్బుకి డబ్బా గొప్పకి గొప్పాకూడాను" అని తల్లి చెప్పెను. "తాసిల్దారు అయితే మంచిది. తాలూకా అంతా సవ్వారీ మీద తిరగవచ్చు. కరణాలూ, మునసబులూ, నౌకర్లూ అంతా చేతులో వుంటారు. పైగా కూడా సంపాదించవచ్చు" అని సుందరమ్మ చెప్పెను. భక్తిపోషితమగు ప్రేమ అదీ. రాగరంజిత మగు ప్రణయమిదీ. వేంకటసుబ్బయ్య యోచించెను. చర్చించెను. "నీవుద్దేశమే మంచిది. కలెక్టరుకచేరీలో కాళీ లేదు. సమయం వచ్చినపుడు అందులో ప్రవేశిస్తాను" అని యాతడు సుందరమ్మను, తల్లినిగూడ ఒప్పించి రాజాగారి కాలేజీలో ఉపాధ్యాయుడుగా ప్రవేశించెను.

"అబ్బాయి నామాట విన్నాడు" అని తండ్రి ఆనందించెను. "వూరికే కూచోడం యెందుకూ?" నూరు రూపాయలు పోనివ్వడం యెందుకూ? అని తల్లి సంతోషించెను. "తఱచు కలెకటేరు నాశ్రయిస్తూ వుంటే మంచిది. ప్రస్తుతం యిది బాగానే వుంది" అని సుందరమ్మ మనస్సునకు సమాధానము చెప్పుకొనియెను.

## ②

ఒక సంవత్సరము గడచినది. "బోధనాశక్తి లేదు" అనిచెప్పి కాలేజీనుండి వేంకటసుబ్బయ్యను తప్పించిరి. అదృష్టవశమున కలెక్టరు కచేరీలో కాళీ దొరకెను. నూరురూపాయల జీతగాడు ముప్పది రూపాయలకు కుదిరెను. "బొత్తిగా తక్కువరా అబ్బాయీ?" అని తండ్రి నిరుత్సాహము చూపెను. "ఇప్పుడు కష్టమయినా తరువాత పెరుగుతుంది. ఇబ్బంది లేదు" అని తల్లి చెప్పెను. "నెలకి రెండు కాసులు ఇచ్చేవారు. ఇప్పుడేమి యిస్తారూ? సంసారానికే చాలదు. అయితేలెండి. దొరకి దయ వచ్చేలాగ మసలుకోండి" అని సుందరమ్మ చెప్పుచుండెను.

జీతముతెచ్చి చేతిలో పోసినపుడెల్ల "ఏం లాభంరా నాయనా? తాసిల్దారీకోసమూ, మేస్త్రీటుకోసమూ ఆసపడి మేష్టరీలో అశ్రద్ధచేసి నూరురూపాయలు పాడుచేసుకున్నావురా" అని తండ్రి యనుచుండగా వేంకట సుబ్బయ్య నిరుత్తరుడగుచుండెను.

ఈ సమయమున ఎదుటియింటివారి కొడుకు న్యాయవాదము ప్రారంభించెను.

మఱల నొక సంవత్సరము గడచినది. పని హెచ్చెను; గాని జీతము పెరుగలేదు. కలెక్టరు మాఱెను. యురపియనుపోయి అరవపిళ్ళవచ్చెను. ఆతడు సర్కారు వ్యవహారములు సరిచూచుటకు ముందు తన కచేరీలోనున్న గుమాస్తాల జాతులను పరీక్షించెను. అచిరకాలమునందే బ్రాహ్మణులకు నిరాశగలిగెను. పిళ్ళ ముందు వచ్చిన బ్రాహ్మణులను వెనుకకు బెట్టి వెనుక వచ్చిన బ్రాహ్మణేతరులను ముందుకు తీసెను. ఈకారణమువలన వేంకటసుబ్బయ్యకు కావలసిన ఖాయపు రెవెన్యూఇనస్పెక్టరీ ఒక మంగలికిబోయెను. సుందరమ్మయు, అత్తగారును చాల విచారించిరి.

మఱల సంవత్సరము గడచినది. సర్కారు పిళ్ళను రెవెన్యూబోర్డునకు తీసికొనిరి. పిళ్ళస్థానమున సాహేబు వచ్చెను.

మఱల ప్రవృత్తి మాఱినది. కచేరీలో తురకల సంఖ్య హెచ్చినది. హిందూ గుమాస్తాలకు సెలవు కావలసివచ్చినచో వారి క్రిందివారయినను మహమ్మదీయులు సిఫార్సు చేయవలసి వచ్చెను. ఏవిధముగా కాళీయైనను అస్థలము లన్నియు మహమ్మదీయులకే చెందసాగెను. డఫేదారగు మీరాసాహేబు గౌరవమున పెర్సనల్ అసిస్టెంటుకంటె పెద్దవాడయ్యెను. "తురకలను కనిపెడుతూ వుండాలి" అని తాలూకా కచేరీలకు వాగ్రూపములైన తాఖీదులు వెడలెను.

ఒక సంవత్సరము గడుచునప్పటికి సాహేబుగారికి గుంటూరుజిల్లాకు అసిస్టెంటు కలక్టరుగా వెళ్ళవలసినదని ఉత్తరువు వచ్చెను. "కులాభిమానము చూపుటలో నున్న చాతుర్యము కచేరీపనులను నెఱవేర్చుటలో లే"దనీ సాహేబుగారిని గుఱించి సర్కారులో షరా వ్రాయబడినట్లు హిందూగుమాస్తాలు చెప్పుకొనసాగిరి.

తురకపోయి క్రిష్టియను వచ్చెను. మఱల ప్రవృత్తి మారినది. మఱల వడపోత ప్రారంభమయ్యెను. మఱల కాళీలన్నియు క్రిష్టియనుల వశమయ్యెను. కొన్నిదినములకు ఆరోగ్యము చెడగా క్రిష్టియను కలెక్టరు తంజావూరునకు బదలాయింపు చేయించుకొనియెను. ఈ మూడుసంవత్సరములయందును జరిగిన భాగవతమును బాగుగ పరీక్షించిన సర్కారు ఈసారి యురపియనుని పంపిరి. "కలెక్టరు మావాడయ్యా" అను అహమికలు కట్టుపడెను. "ఎవరు వచ్చినా మాపని చిట్టచివరే" అని బ్రాహ్మణోద్యోగులు సంతుష్టిపొందిరి. రెండు సంవత్సరములు గడచిన తరువాత వేంకటసుబ్బయ్యకు రెవెన్యూ ఇన్‌స్పెక్టరీ అయ్యెను.

# 3

కుమారుని ఉచ్చదశ చూడకమునుపే వేంకటసుబ్బయ్య తండ్రి స్వర్గస్థుడయ్యెను. తండ్రి దినవారపు ఖర్చుల నిమిత్తము ఆతడు ఇంటియెదుట న్యాయవాదము ప్రారంభించిచేయుచున్న నరసయ్య వద్ద నూరురూపాయలు బదులు పుచ్చుకొనియెను.

నరసయ్య భార్య యేటేటను క్రొత్తనగలు చేయించుకొనుచుండుటయు, ఆతడు ఇల్లు తీసివేసి మేడకట్టించుటయు జూడగా సుందరమ్మకు ఉద్వేగము కలిగెను. "ఇక ఫరవా వుండదు. ఇనస్పెక్టరీ అయిందికదా. ఇక తాసిల్దారీ యెంతసేపూ?" అని యామె హృదయావేగమును శాంతింపజేసుకొని భర్తతో కూడ తాపేశ్వరము వెళ్ళెను. ఇంతవఱకు వేంకటసుబ్బయ్యగారి పెళ్ళాము అని మాత్రమే అనిపించుకొనిన సుందరమ్మకు ఇపుడు "రెవెన్యూ ఇనస్పెక్టరుగారి భార్య" అను బిరుదువచ్చెను. ఆమెకు భావికల్పనలు అతిజటిలముగా ప్రారంభమయ్యెను. "మొదటి పంట తనిఖీకి వెడుతున్నాను. వారంరోజుల దాకా యింటికి రావడానికి వీల్లేదు. కూడా వస్తావా యేమిటి?" అని వేంకట సుబ్బయ్య చెప్పగా ఆమె యందులకు అంగీకరింపలేదు. "వెడితే తాసిల్దారుగారి పెళ్ళాన్నయేకే వెళ్ళాలి. రెండుపల్లకీలూ వరసగా వెళ్ళాలి. వారికి కరణం యెదురుగుండా వెడితే నాకు కరణం పెళ్ళాం యెదురుగుండా రావాలి" అని యీకారణము చేతనామె బయలుదేరుట మానివేసెను.

నాలుగు సంవత్సరములు క్రొత్త కాసుల మొగము చూడని సుందరమ్మకు ఇప్పుడా లోటు తీఱినది. "నాకు సాదరు ఖర్చులు అంతగా లేవు. జీతంతో సంసారం గడుపు. పైగా వచ్చినది నీయిష్టం" అని వేంకటసుబ్బయ్య భార్యతో చెప్పెను. చిన్న చిన్న సరఫరాలు ప్రారంభమయ్యెను. తేనెపానకము, క్రొత్తబెల్లము, చెఱకుగడలు, గుమ్మడికాయలు, అనపకాయలు సమృద్ధిగా వచ్చుచుండెను. అప్పుడప్పుడు పాలు,పెరుగూ గూడ వచ్చుచుండెను. ఒక్కొక్కపుడు నేయి కొనుక్కోవలసిన అవసరము లేకుండెను.

వేంకటసుబ్బయ్య రెవెన్యూ ఇనస్పెక్టరీలో నుండియే యేడెనిమిది గ్రామములకు బదిలీ యయ్యెను. సుందరమ్మ చాతుర్యమువలన సంసారము కొంచెము చిగిర్చెను. నగల లోపము చాలవఱకు తీఱినది. ఇంకను సంతానము మాత్రము కలుగలేదు. ఒకనాడు రాత్రి యామె "ఏమండీ? మూడేళ్ళయింది యినస్పెక్టరీ అయి. తాసీల్దారీ యింకా యెప్పుడండీ"అని యడిగెను. "చెప్పలేను. దొర గుణం కనిపెడతాడు. పక్షపాతం యెరగడు. న్యాయంగా వెడుతున్నాడు. మంచివాడు. దైవం మేలుచేస్తే ఈయేడో మీదటికో తహసీల్దారీ కాకపోతే డిప్యూటీ తహసీల్దారీ అయినా కావచ్చును" అని భర్త బదులు చెప్పగా "అదయినా మంచిదే. సవ్వారీకి లోటు వుండదు. వూళ్ళమ్మట ఆయనతోగూడా వెళ్ళవచ్చును.

మంచివుద్యోగంలోనే లెక్క అవుతుంది. ఫరవాలేదు. కొంచెం జాగ్రత్తగా మసలుకుంటే మేడకట్టెయ్యవచ్చును" అని భావించుకొనుచు నామె నాటి రాత్రి భర్తకు తాంబూలము ఇచ్చుట మఱిచిపోయియే నిదురించెను.

## 4

మఱునాడు కలెక్టరు దగ్గిరనుండి "నిలిచియుండగా రావలసిన"దని రామచంద్రపురము మకాము నుండి ఉత్తరువు వచ్చెను. వేంకటసుబ్బయ్య పోయి చూడగా దొర ఒక కాగితము చేతికిచ్చెను. చూడగా తాను లంచము పుచ్చుకొని ప్రజోపయోగమునకు వ్యతిరేకముగా కొన్ని గ్రామములలో సర్కారు స్థలములు కొందఱు రైతులకు స్వాధీనము చేసినట్లు అది వ్రాయబడియుండెను. "ఇదంతా అబద్ధం. తమరు తనిఖీ చెయ్యవచ్చును. కిట్టనివాళ్ళు ఈ అర్జీ యిచ్చేరు. వూళ్ళల్లో వుండి పని చేసేటప్పుడు అనేక బాధలు వుంటాయి. ప్రతీరయితుతోటీ మాకు ప్రత్యక్షసంబంధం వుండడం చేత అందఱూ మాదగ్గరికి సులభంగా వచ్చి వుపకారాలు కోరతారు. చెయ్యకపోతే యెవరు వుపకారం పొందలేదో వాళ్ళు యిలాంటి అర్జీలు ఇస్తారు" అని వేంకటసుబ్బయ్య చెప్పగా కలెక్టరు మఱియొక కాగితము చేతికిచ్చెను.

అర్జీలోని విషయములు యదార్థములని తహసీలుదారు అందు వ్రాసెను. వేంకటసుబ్బయ్య మ్రాన్పడెను. "ఏమి చెబుతావు?" అని దొర యడుగగా "ఆయన లంచం పుచ్చుకొన్న దాఖలాలు గూడా వున్నాయండి. నేను రుజువు చెయ్యగలను. కోడిగుడ్ల దగ్గిరనుంచీ, వీసెడు పొగాకు దగ్గిరనుంచీ, చంటిపిల్లకి కుమ్మటాముదం దగ్గిరనుంచీ, పచ్చగడ్డి దగ్గిరనుంచీ తాసిల్దారుగారు లంచంపడుతున్నారని తెలుస్తోందండి. దేవరవారు తనిఖీ చేయించాలి" అని యాతడు బదులు చెప్పెను. "ముందు నీకు రెవెన్యూ ఇనస్పెక్టరీ తగ్గిస్తున్నాను. మళ్ళీ గుమాస్తాగా పనిచెయ్యి. నమ్మకంగా వుంటే తరువాత మళ్ళీ నీకు ఉద్యోగం హెచ్చిస్తాను. తహసీలుదారు లంచగొండితనాన్ని గుఱించిగూడా అర్జీలు వచ్చి రుజువయితే శిక్షిస్తాను" అని దొర ఖచ్చితముగా చెప్పి వెంటనే కాకినాడ వెళ్ళి కచేరీలో చేరుటకు ఉత్తరువు ఇచ్చెను.

## 5

సుందరమ్మకు సగము తయారయిన మేడ కూలిపోయినట్లు తోచెను. నెలదినము లామె చాల పరితపించెను. మఱియొక నెలరోజులు ఆమె తీవ్రముగ ఆలోచించెను. "ఇది బాగుంది గాదండీ? ప్లీడరీ చేస్తే వకళ్ళ భయం వుండదు. స్వేచ్ఛగా సంపాదించుకోవచ్చును. లాపరీక్షకి చదవండీ" అని యామె ప్రోత్సహింపగా వేంకటసుబ్బయ్య అందులకు అంగీకరించెను; గాని డబ్బులేక

సందేహించెను. "కాసుల పేరూ, వడ్డాణమూ అమ్మేయండి. తరువాత చేయించుకోవచ్చును" అని సుందరమ్మ చాల ఉద్రేకముతో చెప్పెను. తోడనే యాతడు రెండేళ్ళు సెలవుపెట్టి మదరాసు వెళ్ళి లాకాలేజీలో ప్రవేశించెను.

మొదటిసంవత్సరము యఫ్.యల్ పరీక్ష తప్పి పోగా "అదృష్టం వుంటే ఫష్టుగ్రేడు అయితే మాత్రంగయేమి లోపమూ? జిల్లా కోర్టులలో కూడా పనిచెయ్యవచ్చుగదా? బి.యల్ పరీక్షలో నెగ్గినవాళ్ళంతా హైకోర్టు ముఖం చూస్తున్నారా యేమిటి? సెకండుగ్రేడు ప్లీడరీ చేసిగూడా చాలామంది బాగుపడ్డవాళ్ళు వున్నారు" అని నిశ్చయించుకొని యాతడు ఫష్టుగ్రేడు పరీక్షకు చదివి పరీక్ష యిచ్చెను. వెంటనే కాకినాడలో ప్రవేశించి బల్ల కట్టెను.

ఎదుటి యింటి నరసయ్య పని యెక్కువగుట వలన కొన్ని చిన్న దావాలు ఇచ్చెను. వాకిటిలో గూర్చుండి వేంకటసుబ్బయ్య కక్షిదారుల కాగితములు చదివి సంగతులు యోచించుకొనుచుండగా లోపల కూర్చుండి సుందరమ్మ భావికల్పనలు చేయసాగెను. కక్షిదారులను చేరదీయుటకు వేంకటసుబ్బయ్య అనేకవిధముల ప్రయత్నించెను. ఎన్నడును మన్నన యెఱుగని అనేకులను ఏమండీ అని పిలువజొచ్చెను. ఏజెంట్లకు టిఫిన్ ఇప్పించసాగెను. మునసబుకరణములకు కలెక్టర్‌కచేరీలో నున్న పనులను డబ్బు పుచ్చుకోకుండా ఉచితముగా చేసిపెట్టజొచ్చెను. దేవాదాయములను గుఱించి దావాలను చేసి బాగుచేయవలయునని ప్రతిసభలోను తీర్మానము ప్రవేశపెట్టి చర్చలు చేయజొచ్చెను.

## ⑥

ఎన్ని చేసినను ప్రయోజనము కలుగలేదు. నరసయ్య చాచిన చేయి ముడుచుకొనియెను. పనిచేసిన దావాలకు ఈయవలసిన ఫీజును తనకీయవలసిన నోటు బాకీ క్రింద జమకట్టుకొనియెను. కక్షిదారులు గుమ్మములోనికి వచ్చుట మానివేసిరి. అన్ని విధములను వ్యాపారము దిగదీసెను. "ఇలా వుందేమండీ?" అను సుందరమ్మ ప్రశ్నలు హెచ్చుజొచ్చెను.

"ఏమి చేయుదునూ? నాకు తెలిసినట్లు లా యీ కాకినాడలో యెవరికీ తెలవదు; గాని నాకు మాట్లాడుటకు శక్తిలేదు. వ్రాయగలను; గాని ముఖాముఖీని వాదించలేను" అని చెప్పగా "అయితే మున్సబీవుద్యోగానికి ప్రయత్నం చెయ్యండి" అని సుందరమ్మ చెప్పెను.

వేంకటసుబ్బయ్య లా పుస్తకములను అమ్మివేసి మదరాసు వెళ్ళి ఉద్యోగస్థుల నాశ్రయించుచుండగా శాసనసభలో "అయిదేళ్ళవఱకును బ్రాహ్మణులకు జిల్లా మున్సబీపదవులు ఇవ్వగూడ"దని తీర్మానము నిశ్చయమయ్యెను. నిర్విణ్ణుడై వేంకటసుబ్బయ్య యింటికి వచ్చెను.

రాజమండ్రీ నుండి బావమఱది వచ్చి సలహా చెప్పగా వేంకటసుబ్బయ్య రాజమండ్రీ ప్రవేశించి తన బావమఱదితో ఉమ్మడిగా బట్టలవర్తకము చేయుటకు నిశ్చయించుకొనియెను. "ఉద్యోగం మానెయ్యమంటావుటరా అన్నయ్యా? కాసులపేరూ, వడ్డాణం కూడా తగలబెట్టుకున్నానురా. ఇక లాభం లేదంటావా? నెల్లాళ్ళయినా తాసీల్దారీ దొరికింది కాదురా; వర్తకం చేస్తే బాగుంటుందిటరా?" అని సుందరమ్మ చాల దైన్యముగా నడుగగా అన్న అనేకవిధముల ఆమెకు నచ్చచెప్పెను.

యుక్తసమయమున వేంకటసుబ్బయ్య కాకినాడలోని యింటిని విక్రయించి రాజమహేంద్రవరము ప్రవేశించెను. అదృష్టము తిరుగుటవలన వేంకటసుబ్బయ్యకు లాభించెను. బావమఱుదులిద్దఱును శ్రద్ధగా పనిచేయుటవలన రాజమహేంద్రవరమున కంతకును వారి దుకాణమే పెద్దదయ్యెను. లాభము వచ్చుచున్నను సుందరమ్మ కొన్ని దినములవఱకును "తాసీల్దారీ అయిందికాదు" అని విచారించుచుండెడిది; గాని తుదకు "ఇదేబాగుంది. తాసిల్దారు పెళ్ళాం అంటే ఒకడికి నవుకరు పెళ్ళాం అన్నమాట. నేను స్వతంత్రురాలిని. నాకేమీ?" అని మనసు దిట్టపఱుచుకొనియెను. మొదట వచ్చిన లాభముతో నామె కాసులపేరును వడ్డాణమును మఱల చేయించుకొనియెను. వేంకటసుబ్బయ్య నౌకరీని తలంచుకొని అసహ్యించుకొనజొచ్చెను. తనవద్దకు వచ్చిన యువకుల కందఱకు నాతడు నౌకరీలో ప్రవేశించవద్దనీ, వర్తకము చేసికోవలసినదనీ సలహా చెప్పసాగెను.

❀ ❀ ❀